క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

నవాబుపేట: మండల కేంద్రంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఎంపీపీ అనంతయ్య అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ఉంటుందని ప్రజాప్రతినిధులు, మండల అధికారులు విధిగా పాల్గొనాలని సూచించారు.

ఆలయానికి నిర్మాణానికి సహకరిస్తాం

నవాబుపేట: కొండాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయం నిర్మాణం కోసం తనవంతుగా సహకరిస్తానని బీఆర్‌ఎస్ నాయకుడు అభిమన్యురెడ్డి తెలిపారు. సోమవారం గ్రామస్తులు ఆయనను హైదరాబాద్‌లో కలిసి విరాళం కోరారు. కాగా స్పందించిన ఆయన నూతన విగ్రహాలను తాను సొంత ఖర్చుతో చేయించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ సర్పంచ్ యాదయ్య, రాఘవేందర్‌రెడ్డి, మాదవులు, బాల్‌రాజ్, నర్సింహనాయక్, కృష్ణయ్య, సాయిలు సన్మానించారు.

డిమాండ్లను పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నిరుద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయ్య సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుద్యోగుల తరఫున నిరాహార దీక్ష చేస్తున్న ఓయూ విద్యార్థితో ప్రభుత్వం చర్చలు జరపాలన్నారు. ఆయన నిరాహార దీక్ష విరమించేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టింపులకు పోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. .

వైద్యులకు సన్మానం

జడ్చర్ల: డాక్టర్స్ డేను పురస్కరించుకుని సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జడ్చర్లలో వైద్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు నయీముద్దీన్, కార్యదర్శి శ్యాంసుందర్, ఉపాధ్యక్షులు శంకర్‌బాబు, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
నవాబుపేట: మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ల ఫోరం ఆధ్వర్యంలో వైద్యసేవకులకు సన్మానం చేశారు. ఫోరం అధ్యక్షుడు నర్సింహులు, సభ్యులు వెంకటేశ్వరప్ప, పండరీనాథ్, ఆనందం, విజయ్‌కుమార్, చిన్నస్వామి తదితరులు ఉన్నారు.

కళాశాలలో చేరాలని ప్రచారం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో విద్యార్థులు చేరాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌తో పాటు పలువురు లెక్చరర్‌లు జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా చదువుతో పాటు అన్ని వసతులు కల్పిస్తామని, న్యాక్ గుర్తింపు ఉందని, పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలకు తగ్గట్టు పూర్తి స్థాయిలో వసతులు ఉన్నాయన్నారు.

కనుల పండువగా ఊరేగింపు



అడ్డాకుల: కందూర్‌లో శ్రీ నిర్మలానంద కృష్ణమాంబ 24వ ఆరాధన సహిత సప్తాహ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. అమ్మవారి ప్రియ శిష్యుడు గంగాధర్‌గౌడ్ ఆధ్వర్యంలో పల్లకీసేవ నిర్వహించారు. కృష్ణమాంబ చిత్రపటం, పాదుకలను పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్క భజనలు, కోలాటాలు, బొడ్డెమ్మలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం చేశారు.

విద్యుదాఘాతానికి గురైన పంచాయతీ సిబ్బంది

ధన్వాడ: మండలంలోని గున్ముక్లలో పంచాయతీ కార్మికుడు వెంకట్రాములు సోమవారం వీధి దీపాలు బిగిస్తూ విద్యుదాఘాతానికి గురై స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే గ్రామస్తులు మరికల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సోమవారం పంచాయతీ ఆధ్వర్యంలో కార్యదర్శి బాలస్వామి ఆదేశాల మేరకు స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేసేందుకు ట్రాన్స్‌కో అధికారుల అనుమతితో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. స్తంభాలపై హై టెన్షన్ వైర్లు వెళ్తుండటంతో విద్యుత్ షాక్ గురయ్యాడు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని పంచాయతీ కార్యదర్శి బాలస్వామి తెలిపారు.

కేజీబీవీకి మోక్షం ఎప్పుడో?

- గండేడ్‌లో గత నెల చివర్లో ప్రారంభిస్తామన్న అధికారులు
- ఇప్పటికీ ప్రారంభం కానీ తరగతులు
- కొలిక్కిరాని భవనం ఎంపిక



వసతి పరిశీలిస్తున్న డీఈఓ రవీందర్ తదితరులు (ఫైల్)

గండేడ్: మండలానికి కేజీబీవీ మంజూరైందనే గానీ.. దాని నిర్వహణ ఎక్కడ ఉంటుందో అర్థం కానీ అయోమయ పరిస్థితి నెలకొందని గండేడ్ వాసులు అంటున్నారు. తమ ఆడబిడ్డలను స్థానికంగా చక్కగా చదివించుకోవచ్చనే ఆనందం అధికారుల నిర్లక్ష్యపు పోకడలతో ఆవిరైపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెల చివరిలోగా కేజీబీవీని మండలంలో ప్రారంభిస్తామని అధికారులు చెప్పడంతో చాలా మందికి ఆశలు కలిగాయి. కానీ నేటికీ ప్రారంభం కాకపోవడంతో అటు విద్యార్థుల్లోనూ, తల్లిదండ్రుల్లోనూ ఆందోళన రేగుతోంది. గతేడాది కేజీబీవీ గండేడ్‌కు మంజూరు కాగా మండల కేంద్రంలోని అతిథిగృహంలో అప్పటి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. కొత్తగా అడ్మిషన్లు కూడా తీసుకున్నారు. కానీ అనుమతులు రాలేదని నిలిపివేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకం కూడా జరగకపోవడంతో పాఠశాల ప్రారంభం కాలేదు. గండేడ్ పేర జాయిన్ అయిన విద్యార్థులను తిప్పి పంపలేక మహమ్మదాబాద్ లోనే చదివించాలని పై అధికారులు ఆదేశించడంతో అక్కడే ఉంచారు. దీంతో రెండు మండలాల విద్యార్థులు ఒకేచోట కావడంతో అప్పట్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. అదే సమయంలో ఎన్నికలు రావడంతో అది కాస్తా మరుగునపడింది. తిరిగి ఈ విద్యా సంవత్సరంలో కచ్చితంగా ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నా ఇప్పటివరకు దాని ఊసేలేదు.

కొలిక్కిరాని భవనం ఎంపిక..

ఈ ఏడాది కేజీబీవీని ప్రారంభించడానికి ఇటీవల అధికారులు సన్నాహాలు చేశారు. కానీ నిర్వహణకు తగిన భవనం, వసతుల ఎంపికపై నేటికి ఓ కొలిక్కి రాలేదు. మే 25న జిల్లా విద్యాధికారి రవీందర్ ఆదేశాల మేరకు అధికారులు మండలకేంద్రంలోని అతిథిగృహాన్ని పరిశీలించారు. తర్వాత అదే నెల 30న డీఈఓ రవీందర్, సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ శ్రీనివాస్, మండల నాయకులు కలిసి విశ్వభారతి కళాశాలతో పాటు అతిథిగృహం, గ్రామపంచాయతీ వసతులు పరిశీలించారు. నివేదిక తయారుచేసి కలెక్టరుకు పంపిస్తామని డీఈఓ అప్పట్లో చెప్పారు. కానీ నేటికి అది ఫైనల్ కాలేదని సమాచారం. కాగా స్థానికులు మాత్రం కళాశాల కంటే అతిథిగృహం, గ్రామపంచాయతీ వసతులే అనుకూలంగా ఉంటాయని చెప్పారు. ఈ విషయం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అయినా సమస్య కొలిక్కిరాకపోవడంతో పాఠశాల ప్రారంభంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



కేజీబీవీని ప్రారంభించిన అతిథిగృహం(ఫైల్)

ఇదిలా ఉంటే మండల పరిధిలోని ఆయా గ్రామాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎస్‌ఓ లక్ష్మీబాయి మహమ్మదాబాద్ కేజీబీవీలో గండేడ్‌కు సంబంధించి ఆరు, ఏడు తరగతులకు గాను దరఖాస్తులు తీసుకున్నారు.
ఇప్పటికే రెండు మండలాలకు కలిపి ఆరు, ఏడు తరగతులకు సంబంధించి 170కి పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే గండేడ్ పాఠశాల ప్రారంభం కాకపోవడంతో విద్యార్థుల ఎంపిక జరగలేదు. దీంతో మహమ్మదాబాద్‌లో ఆరు, గండేడ్‌లో ఆరు, ఏడు తరగతులు ప్రారంభం కాలేదు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. కొందరు వేరే పాఠశాలకు వెళ్తే.. జాయిన్ అవ్వమని ఒత్తిడి చేస్తుండగా మరికొందరు పిల్లలు ఇంటి దగ్గరే ఉంటున్నారు. దీంతో తల్లిదండ్రులు ఎటు తేల్చుకోక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కేజీబీవీలో చదవాలని ఉంది..



కేజీబీవీలో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పడంతో అక్కడ చదవాలన్న అనుకున్నా. దీనికితోడు హాస్టల్ కూడా ఉండడంతో చదువుకు ఎక్కువ సమయం కేటాయించవచ్చని ఆరోతరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నా. ఇంకా తరగతులు ప్రారంభం కాలేదు. ఖాళీగా ఉండడం ఎందుకని చిన్నవార్వాల్ పాఠశాలకు వెళుతున్నా. అయితే ఉపాధ్యాయులు జాయిన్ కావాలని ఒత్తిడి చేస్తున్నారు. అంతా అయోమయంగా ఉంది.

– అనురాధ, ఆరోతరగతి, చిన్నవార్వాల్

అయోమయంగా ఉంది..



పాఠశాలలు ప్రారంభం అయి 20 రోజులు గడుస్తున్నాయి. ప్రారంభంలోనే పిల్లలు దరఖాస్తులు సమర్పించారు. ఇంకా ఆరో తరగతి లిస్టు ప్రకటించడం లేదు. దీంతో పిల్లలను ఎక్కడికి పంపాలో తెలియడం లేదు. మహమ్మదాబాద్ కేజీబీవీకి వెళ్తే.. ఈరోజు రేపంటున్నారు. దీంతో అయోమయం నెలకొంది. అసలు సీటు వస్తుందా రాదా అని కూడా తెలియడం లేదు. గండేడ్ కారణంగా ఇక్కడి విద్యార్థులను ఎంపిక చేయకుండా అలాగే ఉంచడం సరికాదు. అధికారులు సత్వరమే నిర్ణయం తీసుకోవాలి. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దు.

– ఊరడి అశోక్, మహమ్మదాబాద్.

త్వరలో ప్రారంభిస్తాం..

గండేడ్‌లో ఆరు, ఏడు తరగతులు త్వరలోనే ప్రారంభిస్తాం. వసతి ఎంపిక పూర్తి కాగానే మిగతా ప్రక్రియ ప్రారంభిస్తాం. ఉపాధ్యాయులను కూడా త్వరలో నియమించేలా చర్యలు చేపడుతాం. ఈరెండు రోజుల్లో గండేడ్, మహమ్మదాబాద్ పాఠశాలలకు దరఖాస్తు చేసుకున్న వారిని ఎంపిక చేస్తాం. డ్రా ద్వారానా లేక పరీక్ష ద్వారానా అనేది ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు చేపడతాం.

– వెంకటయ్య, ఎంఈఓ, గండేడ్

పరిశ్రమలకు సకాలంలో అనుమతివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను ప్రభుత్వ నిబంధల ప్రకారం సకాలంలో అందజేయాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో టీప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ ఔత్సాహికులు నెలకొల్పిన సేవారంగంలోని 15 యూనిట్లకు రూ. 50.81178 లక్షల పెట్టుబడి రాయితీ మంజూరు చేశారు. సెజ్‌లోని పరిశ్రమల ద్వారా పారిశ్రామిక వ్యర్థాలను బయటకి రాకుండా శుద్ధీకరణ ప్లాంట్‌కు తరలించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.
దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ విజయేందిర సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ధరణి విషయంపై తహసీల్దార్ శ్రీనివాసులు, ఇతర అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం తనిఖీ చేసి ప్రజాపాలన కేంద్రంపై ఆరా తీశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు వివరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను కలెక్టర్ తనిఖీ చేశారు. రోగులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారని వైద్యాధికారి శరత్‌ను అడిగారు. మెరుగైన చికిత్సలు అందించాలని, ఐసీయూని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రారంభమైన బర్హానే బాదేషా దర్గా ఉర్సు



విద్యుత్ దీపాల వెలుగులో దర్గా

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని హజ్రత్ బర్హానే బాదేషా రెహమతుల్లా అలై దర్గా 254వ ఉర్సు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఉత్సవాలను పురస్కరించుకొని దర్గా ముతవల్లి డాక్టర్ గయాజ్‌పాష ఖాద్రీ హకం షర్ఫీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో మొదటి రోజు దర్గాలో గుస్లె షరీఫ్ (జలాభిషేకం) నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జల్సా ఫైజానే అవులియా ధార్మిక సదస్సు నిర్వహించగా పలువురు మతపెద్దలు పాల్గొని ధార్మిక సందేశాలు ఇస్తారు. దర్గా ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గంధోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న గయాజ్‌పాష

శ్రమజీవులపై నిర్లక్ష్యం తగదు



ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కోయిల్‌కొండ: గ్రామపంచాయితీ కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదురింటి నర్సిములు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యి మందికిపైగా పని చేస్తున్న సిబ్బంది వేతనాలు మూడు నుంచి 11 నెలల వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికీ వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. తక్కువ జీతంతో గ్రామానికి సేవచేస్తున్న శ్రమజీవుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం తగదన్నారు. నెలల తరబడి జీతాలు రాకుంటే కార్మికుల కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా కార్మికులకు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనునాయక్, చెన్నయ్య, గోపాల్, వెంకటయ్య, అజ్జుపాష, కురుమూర్తి, రాందాస్, మైబు, కేశవులు, రాజన్న, లక్ష్మమ్మ, శ్రీనివాస్, బాలకృష్ణయ్య, ఆంజనేయులు వడెన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని పాలమూరు మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆదేశించారు. ముఖ్యంగా సమస్యల పరిష్కారానికి వార్డు ఆఫీసర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో వారితో పాటు ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రజల నుంచి నూతన సీఆర్ పీసీ చట్టం ప్రకారం వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా ఎలాంటి ఫిర్యాదులు అందినా వెంటనే స్పందించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 5నుంచి ప్రారంభించే వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. మొక్కలు నాటే విషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, ఎంఈ యు.బస్వరాజ్, డిప్యూటీ ఈఈ బెంజిమన్, ఏఈలు హరికృష్ణ, వైష్ణవి, సాయిరాం, ఆర్‌ఐలు ఎస్.నర్సింహులు, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న ఇంటి కూల్చివేత

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలోని కల్వకుర్తి రోడ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిని సోమవారం అధికారులు కూల్చివేశారు. బాధితులు సతీష్‌రెడ్డి, నంద కిషోర్‌గౌడ్ మాట్లాడుతూ సర్వే నంబర్ 147/బీలో తమ ప్లాటులో నిర్మిస్తున్న ఇంటి పనులకు సంబంధించి అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అకస్మికంగా కూల్చివేశారన్నారు. తాము నిబంధనల మేరకు అనుమతి తీసుకుని పనులు చేపట్టామన్నారు. అయితే తమ ప్రత్యర్థి ఇచ్చిన ఫిర్యాదును ఆధారం చేసుకుని అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని వారు ఆరోపించారు. కాగా తనకు చెందినప్లాటులో అక్రమంగా ఇంటి పనులు చేపడుతున్నారన్న ఫిర్యాదుతో అధికారులు స్పందించారని లింగన్నగౌడ్ అనే వ్యక్తి వివరించారు. మున్సిపల్ కమిషనర్ రాజయ్యను వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

దయాకర్‌రెడ్డికి నివాళి అర్పించిన ఎమ్మెల్యేలు

చిన్నచింతకుంట: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఎమ్మెల్యేలు జి. మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికా రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు వంశీచందర్ రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పేట కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొని ఘనంగా నివాళి అర్పించారు. దయాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కుటుంబసభ్యులు సీతాదయాకర్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, కార్తిక్‌రెడ్డి, హాజరయ్యారు.

ఎస్పీని కలిసిన సీఐడీ డీఎస్పీ

పాలమూరు: ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న డి.జానకిని సోమవారం తన కార్యాలయంలో సీఐడీ డీఎస్పీ కె.శంకర్, సీఐ సైదులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పారదర్శక పాలన అందిస్తాం

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



మూసాపేటలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన అందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద రామలింగేశ్వరాలయం వరకు దాతల సాయంతో వేయనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మూసాపేట రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా 33 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని తెలిపారు. ఆగస్టు 15లోపు రైతుల రుణాలను మాఫీ చేస్తామని, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం..

మూసాపేటలో చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే వస్తే ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ సరోజ గైర్హాజరు కావడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ముగించుకుని వెళ్తున్న సమయంలో వచ్చిన ఎంపీఓపై అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కృష్ణయ్యకు ఫోన్ చేసి మందలించారు. తాను వచ్చే మీటింగులకు మీరు రాకుంటే ప్రజల సమస్యలను ఎవరికి చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టి శేఖర్, ఎంపీటీసీలు గోవర్ధన్, సంతోషి, సత్యనారాయణ, నాయకులు బాలనర్సిములు, బగ్గి కృష్ణయ్య, నారాయణ, ఎస్‌టీగౌడ్, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ జరీనాబేగం


జడ్చర్ల టౌన్: నూతన విద్యావిధానంలో భాగంగా ప్రీప్రైమరీ స్కూల్స్‌గా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దేందుకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీడబ్ల్యూఓ జరీనాబేగం సూచించారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో జడ్చర్ల ప్రాజెక్ట్ పరిధిలోని 4 మండలాల అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆమె సందర్శించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాన్ని విజయవంతం చేయాలంటే క్షేత్రస్థాయిలో ముఖ్యపాత్ర అంగన్‌వాడీలదేనన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ మెహరున్నీసాబేగం, సూపర్‌వైజర్లు రాజరాజేశ్వరి, పద్మాంజలి, కల్పన, అరుణజ్యోతి, సునీత, ట్రైనర్స్ అంజనమ్మ, నాగమణి, శ్రీలత, భాగ్యలతోపాటు 125మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా సోమవారం ప్రియదర్శిని పూర్వ ప్రాథమిక వాచకం 1, పూర్వప్రాథమిక విద్య కరదీపికలను టీచర్లకు అందజేశారు.

విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

మరికల్: విద్యార్థులకు వారానికోసారి అందజేసే రక్తహీనత నివారణ మాత్రలపై వైద్యాధికారి కిరిటి మరికల్‌లో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ విద్యార్థులు ఎలాంటి అనారోగ్య సమస్యలతో బాధపడకుండా ఉండేందుకు అందజేస్తున్న రక్తహీనత నివారణ మాత్రలను క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. సూచనలు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మనోరంజిని, అరవింద్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

అడ్డాకుల: మూసాపేట మండలంలోని పోల్కంపల్లి, అడ్డాకుల సహకార సంఘాల వద్ద సోమవారం రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. వ్యవసాయశాఖ ఏడీఏ యశ్వంత్‌రావు, డీసీఓ పద్మ, సహకార అధికారి టైటస్ పాల్, మండల వ్యవసాయాధికారులు శ్రీనివాసులు, రాజేందర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దూరి జితేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. రైతుబంధు స్థానంలో ప్రభుత్వం అమలు చేయబోయే రైతు భరోసా పథకంలో భాగంగా సలహాలు, సూచనలను రైతుల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో సీఈఓలు వెంకటయ్యగౌడ్, భాస్కర్‌గౌడ్, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు

గ్రూప్స్ పోస్టులు పెంచాలని నిరసన



మెట్టుగడ్డ వద్ద నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీజీపీఎస్సీ ద్వారా చేపడుతున్న గ్రూప్స్-1, 2,3 పరీక్షలకు సంబంధించి పోస్టులను పెంచాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్ర గ్రంథాలయం నుంచి మెట్టుగడ్డ వరకు అభ్యర్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ నోటిఫికేషన్‌లో వేసిన పోస్టుల కన్నా ఖాళీలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఈ మేరకు పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు గ్రూప్-1లో మెయిన్స్‌కు 1:100 రేషియో ప్రకారం తీసుకోవాలని కోరారు. తద్వారా అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. వెంటనే ప్రభుత్వం రేషియో పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నిరుద్యోగ సంఘం నాయకులు మిట్టి యాదయ్య, రమేష్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు చేసుకునేందుకు బారులు

దేవరకద్ర: మండల పరిషత్ కార్యాలయం వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ప్రజాపాలన దరఖాస్తులు ఇవ్వడానికి బారులు తీరారు. ప్రజలు పెద్ద ఎత్తున రావడంతో కార్యాలయాన్ని మూసి వేసి కేవలం కిటికీలను మాత్రమే తెరచి అధికారులు దరఖాస్తులను తీసుకున్నారు. ఇప్పటి వరకు 830 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఎక్కువగా జీరో కరెంట్ బిల్లు, రూ. 500 గ్యాస్ కనెక్షన్‌లకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని వివరించారు.